www.samasamajam.in

# సమసమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | గురు వారం, 18 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-128 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పు రావాలి




కులమతాల పేరుతో విడదీసే కుట్రలను నిలవరించాలి

నీచరాజకీయాల కోసం ఎంతకైనా తెగిస్తున్నారు

అభివృద్ధితో సాగుతున్న తెలంగాణ విచ్ఛిన్నానికి కుట్ర

మోసపోతే గోస పడుతామని హెచ్చరించిన సిఎం కెసిఆర్

మేడ్చెల్ కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించిన సిఎం కెసిఆర్

తెలంగాణ అభివృద్ధి.. 24 గంటల కరెంట్ ఆదర్శమని వెల్లడి

**న్యూఢిల్లీ, అగస్టు 17 (సమ సమాజం):** జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పులు రావాల్సి ఉందని సిఎం కెసిఆర్ అన్నారు. అభివృద్ధి చెందిన తెలంగాణను ధ్వంసం చేసే కుట్ర జరుగుతోందని బిజెపిపై మరోమారు ఫైర్ అయ్యారు. అభివృద్ధి చెందిన తెలంగాణను ఇలాగే ముందుకు తీసుకునిపోవాల్సి ఉందన్నారు. కానీ దీన్నిచెడగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి కొనసాగడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీచ రాజకీయాల కోసం ఎంతకైనా తెగించే వారు ఎప్పటికీ ఉంటారని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. అలాంటి వారి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సమీపంలోని అంతాయిపల్లి వద్ద 30 ఎకరాల్లో 56 కోట్లతో నిర్మించిన నూతన కలెక్టరేట్ భవనాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో సీట్లో కలెక్టర్ ఎస్ హరీశ్‌ను కూర్చుండబెట్టి.. పుష్పగుచ్ఛం అందించి. శుభాకాంక్షలు తెలిపారు. 30 ఎకరాల విస్తీర్ణంలో రూ.56.20 కోట్ల నిధులతో శామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రభుత్వం నిర్మించింది. కార్యక్రమంలో మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, కలెక్టర్ ఎస్ హరీశ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మనం జాగ్రత్తగా ఉంటే మన రాష్ట్రాన్ని దేశాన్ని కాపాడుకోగలమని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. అందరూ ఐక్యంగా ఉండి రాష్ట్ర ప్రగతికి దోహదపడాలని పిలుపునిచ్చారు. దేశ రాజకీయాల్లో ప్రభావం చూపేలా చైతన్యంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఏమాత్రం మోసపోయినా గోస పడతామని ప్రజలను సీఎం హెచ్చరించారు. మేడ్చల్‌లో కలెక్టరేట్ భవనం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని సీఎం కేసీఆర్ అన్నారు. మేడ్చల్ జిల్లా అవుతుందని ఎవరూ అనుకోలేదన్నారు. తెలంగాణ ఏర్పాటు వల్లే ఇది సాధ్యమైందన్నారు. ప్రజలకు పరిపాలన ఎంత దగ్గరకు వస్తే అంత చక్కగా పనులు జరుగుతాయని వెల్లడించారు. పరిపాలనా సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలు ఏర్పాటు జరిగిందని పేర్కొన్నారు. మనం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంటే నిరంతర విద్యుత్, సంక్షేమం వచ్చేదా అని ప్రశ్నించారు. దేశంలో జరిగే పరిణామాలపై ఎప్పటికప్పుడు చర్చలు జరగాలి. చైతన్యవంతమైన సమాజం ఉంటే ముందుకు పురోగమిస్తాం. సమాజంలో విద్వేషం పెచ్చరిల్లిందంటే మళ్లీ ఏకం కావడం కష్టం. అభివృద్ధి చెందిన దేశాల బాటలో కుల, మత రహితంగా ముందుకు సాగాలి. నీచ రాజకీయల కోసం ఎంతకైనా తెగించే ఎప్పటికీ ఉంటారు. అందుచేత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. జాగ్రత్తగా ఉంటే మన రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోగలం అన్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో కరెంటు పోదని, కానీ దేశరాజధాని ఢిల్లీలో మాత్రం 24 గంటల కరెంటు రాదని సీఎం కేసీఆర్ అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టరేట్ ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇస్తున్నామని, ఈ విషయం పదే పదే చెప్పడానికి కారణం ఉందన్నారు. హైదరాబాద్‌లో కరెంటు పోదు.. అదే దేశరాజధాని ఢిల్లీలో 24 గంటల కరెంటు రాదు. దేశంలో పరిస్థితి 3వ

## రూపాయికి శస్త్ర చికిత్స చేయాల్సిందే

దిగుమతుల భారం తగ్గితేనే సత్ఫలితాలు

కేంద్రం నిర్ణయాల కోసం ప్రజల ఎదురుచూపు




**ముంబై, అగస్టు 17 (సమ సమాజం):** రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం 2014 ఆగస్టు 14న డాలర్‌కు 61.05 పైసలు. ఈ ఎనిమిదేళ్లలో అది ఇప్పుడు రూ.80కి చేరుకుంది. ఇదొక్కటి చాలు మనమెంతగా ఆర్థికంగా చితికి పోయామో చెప్పడానికి. రూపాయి బలపడిందంటే మన ఎగుమతులు పెరిగాయని అర్థం చేసుకోవచ్చు. దీనివల్ల మన విదేశీ మారక నిల్వలు మరించుకు పోతున్నాయి. ఇదంతా కేవలం దిగుమతుల ప్రభావం అనడంలో ఎలాంటి సందేహం లేదు. మోడీ సాధించిన ఆర్థిక ప్రగతి ఎలా ఉన్నా రూపాయిని మాత్రం పట్టుకోలేక పోతున్నారు. నిజంగా రూపాయికి శస్త్రచికిత్స చేసే కార్యాక్రమాలు 3వ

## సోనియాకు గులాంనబీ షాక్

కాశ్మీర్ బాధ్యతలు వద్దంటూ తిరస్కరణ



**న్యూఢిల్లీ, అగస్టు 17 (సమ సమాజం):** కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీకి పార్టీ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ షాకిచ్చారు. జమ్ముకశ్మీర్ పార్టీ ప్రచార కమిటీ సారథిగా నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకోగా.. ఆ బాధ్యత స్వీకరించేందుకు నిరాకరించారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీకి కూడారాజీనామా చేశారు. తనను తక్కువ చేస్తూ తీసుకున్న నిర్ణయాలపై ఆయన అసంతృప్తితో సున్నితంగానే పదవులను దూరం పెట్టారు. కొన్నేళ్లుగా కాంగ్రెస్ నాయకత్వంపై అసంతృప్తి గళం వినిపిస్తున్న సీనియర్ నేతల జీ 23 గ్రూప్ లో ఆజాద్ ప్రముఖుడు. ఇప్పటికే కాంగ్రెస్ వ్యవహారాల కమిటీలో ఉన్న ఆజాద్ ను జమ్ముకశ్మీర్ కు పరిమితం చేయడం తన హోదా తగ్గించినట్టు అవుతుందని అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఆజాద్ కు సన్నిహితుడు అహ్మద్ మీర్ జమ్ము కశ్మీర్ కాంగ్రెస్ చీఫ్ పదవి నుంచి తప్పు కోవాల్సి వచ్చింది. జమ్ము అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా.. ఎన్నికలు, ప్రచారం సహా ఇతర కమిటీలను 3వ

## 6 లక్షల గణేష్ విగ్రహాలను పంపిణీ

ఉత్సవాలు,నిర్వహణ, నిమజ్జనాలపై ప్రత్యేక శ్రద్ధ

మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ వెల్లడి



3వ

## కెసిఆర్‌పై బండి విమర్శలు మానాలి: ఎమ్మెల్యే దానం



**హైదరాబాద్, అగస్టు 17 (సమ సమాజం):** జాతిపిత మహాత్మాగాంధీని చంపిన గాడ్సేలకు ప్రాధాన్యం ఇస్తున్నారు కానీ గాంధీకి మాత్రం గౌరవం దక్కట్లేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... బీజేపీరాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ గల్లీ లీడరా... జాతీయ పార్టీకి అధ్యక్షుడా అని ప్రశ్నించారు. వాపును చూసి బలుపు అనుకుంటున్నారన్నారు. బండి సంజయ్ అన్ని అబద్దాలే మాట్లాడుతారని విమర్శించారు. పిచ్చోడి చేతిలో రాయిలా మారారన్నారు. బండి సంజయ్ కేసీఆర్ పై పిచ్చి మాటలు మానాలని హితవుపలికారు. బండి సంజయ్ ఓ తుగ్లక్ అని అన్నారు. కేంద్ర నిధులపై గోడలపై రాసుకోవటం కాదని... గుండు మీద రాసుకోవాలని వ్యాఖ్యలు చేశారు. మోదీకి కుటుంబమే లేదని... కుటుంబ పాలన గురించి మాట్లాడే అర్హత లేదని దానం నాగేందర్ అన్నారు.

## సాగర్ డ్యాంపై ప్రమాదం

గేట్లు సరిచేస్తుండగా టెక్నీషియన్‌కు తీవ్రగాయాలు

మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలింపు



**నల్లగొండ, అగస్టు 17 (సమ సమాజం):** నాగార్జునసాగర్ డ్యాంపై మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ అజమతుల్లా తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని స్థానిక కమలా నెహ్రూ ఆసుపత్రిలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అధికారులు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... నాగార్జునసాగర్ డ్యాంపై గేట్ల విభాగంలో గేట్స్ ఆపరేటర్ గా పనిచేస్తున్న అజ్మతుల్లా డ్యాం పైభాగాన గేట్స్ ఆపరేట్ చేసే విభాగంలో గేట్ల ద్వారా విడుదల చేస్తున్న నీటి పరిమాణాన్ని తగ్గించే క్రమంలో 26వ క్రస్ట్ గేట్ కు సంబంధించిన మోటార్ ఫ్యాన్ రెక్కలు విరిగిపోయి ఆయన కుడి కాలికి తగలడంతో కాలుకి తగిలి 70శాతం వరకు కాలుకు తీవ్ర గాయమైంది. అనుకోకుండా జరిగిన ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అజ్మతుల్లాను వెంటనే అధికారులు సిబ్బంది కలిసి స్థానిక ఆసుపత్రికి తరలించారు. సాగర్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం క్రస్ట్ గేట్ మోటార్ ఫ్యాన్ నుండి విరిగిపోయిన 3వ

## జనగామ జిల్లాలో కొనసాగిన సంగ్రామ యాత్ర

భారీగా తరలివచ్చి స్వాగతం పలికిన ప్రజలు

అప్పిరెడ్డిపల్లి వద్ద వేయికిలోమీటర్లు పూర్తి

పైలాన్ ఆవిష్కరించిన బండి సంజయ్

పలు గ్రామాల్లో భారీగగా ఫ్లెక్సీలు ఏర్పాటు



**జనగామ, అగస్టు 17 (సమ సమాజం):** భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రజాసంగ్రామ యాత్ర మరో మైలురాయి చేరుకుంది. యాదాద్రిలో ప్రారంభించిన మూడో విడత యాత్ర బుధవారంతో వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. జనగామ జిల్లా అప్పిరెడ్డిపలె వద్దకు చేరడంతో వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ గ్రామంలో బండి సంజయ్ పైలాన్ ఆవిష్కరించారు. డప్పు చప్పుళ్లు, బాణాసంచాతో కాషాయ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. జిల్లాలోని అప్పిరెడ్డిప్లలె వద్దకు చేరడంతో వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. ఈ మైలురాయికి చిహ్నంగా బండి సంజయ్ పాలకుర్తి మండలం అప్పిరెడ్డిప్లలె వద్ద పైలాన్ ఆవిష్కరించారు. బెలూన్లు, బాణాసంచా, డప్పు వాద్యాలతో భాజపా శ్రేణులు సందడి చేశారు. చీటూర్, కిష్టగూడెం మీదుగా కుందారం వరకు బండి సంజయ్ పాదయాత్ర సాగింది. ఈ యాత్ర మొదటి నుంచి బండి సంజయ్ కేసీఆర్ సర్కార్‌పై విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతూ వచ్చారు. తెరాస వైఫల్యాలు, కేసీఆర్ పాలనలో జరిగిన అక్రమాలను ఊరూరా వివరించారు. ఒక దశలో కేసీఆర్ ప్రభుత్వంపై బండి సంజయ్ విమర్శలు పరిధులు దాటాయని భావించిన తెరాస నాయకులు భాజపాపై విరుచుకుపడ్డారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం దేవరుప్పులలో కాషాయ శ్రేణులపై తెరాస నేతలు దాడికి దిగారు. ఇరు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో కొందరు భాజపా నేతలు తీవ్రంగా గాయపడ్డారు. వారంతా ఇప్పుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.మరోవైపు ఈ 3వ

## సంపాదకీయం


# నినాదాలతో దేశాన్ని పరుగెత్తించలేం !

ధరల పెరుగుదల, రూపాయి పతనం, నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం ఇప్పుడు దేశాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. దేశ ఆర్థికవ్యవస్థ దెబ్బతింటోందన్న ఆర్థిక నిపుణుల హెచ్చరికలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక కావాలి. ప్రధాని మోడీ ఈ విషయాలపై ఎక్కడా మాట్లాడడం లేదు. ఎర్రకోట ప్రసంగంలోనూ వీటి గురించి ప్రస్తావించలేదు. వీటిని ఎలా అధిగమించబోతున్నారో కూడా చెప్పలేదు. గతంలో చెప్పిన వాగ్దానాలేవీ అమలుకాలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన చివరి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భం గా ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ మాట్లాడుతూ ప్రస్తావించిన అంశాలు ఏవీ అమలుకాలేదు. ఇప్పుడు కొత్తగా మరో 25 ఏళ్ల దార్శనికత గురించి చెబితే ప్రజలు నమ్ముతారా అన్నది ఆలోచించడం లేదు. తన ప్రభుత్వం సాధించిన విజయాలను,చేపట్టిన సంక్షేమ పథకాలను, సంస్కరణలను ఎంతగొప్పగా చెప్పినా పొయ్యిలో పిల్లి లేవని కుటుంబాలు కోకొల్లలు. ఇన్ని చెప్పిన ప్రధాని మోడీ మన రూపాయికి శస్త్రచికిత్స చేసే విషయాన్ని మరచిపోయారు. రూపాయి రోజురోజుకూ చిక్కి శల్యమవుతున్నా ప్రస్తావించడంలేదు. రూపాయి విలువ పెరగలేదు సరికదా మరింత దిగజారుతున్నా పట్టుకుని నిలపాలన్న తపన కానరావడం లేదు. కనీసం దానిని తాను అధికారం చేపట్టిన నాటి స్థాయికి తీసుకుని వద్దామన్న ప్రయత్నం కూడా జరగడం లేదు. ఈ మాంద్యాన్ని గమనించి అడుగులు వేద్దామన్న చిత్తశుద్ధి కానరావడం లేదు.అందుకే మోడీ ఎర్రకోట ప్రసంగంపై ఎక్కడా ఆసక్తి గానీ, ఆయన పిలుపుపై స్పందన గానీ కానరావడం లేదు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు, విదేశాల నుంచి నల్లధనాన్ని వెనక్కి రప్పించడం జరగలేదు. దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో నిరుద్యోగంపైనా ప్రధాని పెదవి విప్పలేదు. ఇలా సమస్యలు వెన్నాడుతున్నా.. ప్రజలను పట్టించుకోకుండా రానున్న పాతికేళ్ల కాలం 'అమృతకాలం' అని చెప్పడం ద్వారా మరో మారు వంచించడం తప్ప మరోటి కాదు. వంచనలతో పాలన చేయలేమని మోడీతో పాటు,రాష్ట్రాల సిఎంలు కూడా గుర్తించాలి. నిరుద్యోగం,ద్రవ్యోల్బణం, జీఎస్టీలతో నిలువుదోపిడి చేస్తున్న తీరుపై స్పష్టత లేకుండా ఎంతకాలం మోసం చేస్తారు. అచ్ఛేదిన్ వాగ్దానం చేసి మరచిపోతే ఎలా అన్నది మోడీ గుర్తు చేసుకోవాలి. పాలకులు తాముచేసిన వాగ్దానాలపై కసరత్తు చేయకుండా మరింతగా ప్రజలను మభ్యపెడుతూ పోతే ఎలా అన్నది మననం చేసుకోవాలి. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్.. అమృత్ కాల్, ఆజాదీకా అమృత్ మహోత్సవం ఇలా నినాదాలతో ప్రజల కడపులు నిండవని గుర్తించాలి. అవరోధా లను, అవకాశాలను పారదర్శకంగా చర్చించి, భవిష్యత్ మార్గాన్ని సూచించడం విజ్ఞత అవుతుంది. కానీ సమస్యలను ముందు పెట్టుకుని వాటిని లేనట్లుగా చూపడం మోసం అవుతుంది. దేశ ఆర్థిక పరిస్థితి గతంలో ఓమారు దిగజారిన వేళ అప్పట్లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పివి నరసింహారావు నడుం బిగించి చక్కదిద్ది, ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పడిపోతున్న రూపాయిని పట్టుకుని లేపారు. విదేశీమారక నిల్వలను నిలబెట్టారు. ఇప్పుడలాంటి చొరవ కానీ, దక్షత కానీ పాలకలుకు లేకుండా పోయింది. కనీసం ఎందరికో భారతరత్నలు ఇస్తున్న ప్రభుత్వం పివి దార్శనికతను గుర్తించి..ఆయనను గౌరవించక పోవడం దారుణం కాక మరోటి కాదు. కనీసం ఆయన చూపి దక్షతనయినా పునికిపుచ్చుకోవడం లేదు. అనుత్పాదక రంగాలకు నిధులను వేలం వెర్రిగా ఖర్చు చేస్తూ పోవడం, దిగుమతులు పెంచడం వంటి చర్యలు దేశీయంగా ఆర్థికరంగాన్ని దెబ్బతీస్తూ వస్తోంది. ఉచిత పథకాలకు మంగళం పాడాల్సింది పోయి వాటిని పెంచుతు న్నారు. ఈ విషయంలో రాష్ట్రాలు విచ్చలవిడిగా నిధులను దుర్వినియోగం చేస్తున్నాయి. దీనిని అర్థం చేసుకోని నేతల కారణంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోంది. తాజాగా మరోమారు ఇలాంటి భయాలు వస్తున్న వేళ కేంద్రం దిద్దుబాటు చర్యలు పూనుకోకుండా నినాదాలకే పరిమితం కావడం ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం కాక మరోటి కాదు. ప్రజలు, పరిశ్రమలు, ప్రభుత్వం ఎక్కువ మొత్తాలను పొదుపు చేసి, ఆ నిధులను పెట్టుబడులుగా ఉపయోగించి, వస్తుసేవల ఉత్పత్తినీ, ఎగుమతులనూ వృద్ధి చేసినప్పుడు మాత్రమే స్థిరమైన ప్రగతిని సాధించగలం. దిగుమతులను తగ్గిస్తూ పోతూ, ఎగుమతులపై దృష్టి పెట్టాలి. అనవసర వస్తువులను అదేపనిగా దిగుమతి చేసుకోవడం తగ్గించాలి. ఇబ్బడిముబ్బడిగా ప్రపంచ మార్కెట్ మనపై పెత్తనం చేయకుండా చూసుకోవాలి. భారత్ లాంటి దేశాల్లో పన్నులు సరళీకృతంగా ఉండాలి. జీఎస్టీని 28 నుంచి 5 శాతానికి పరిమితం చేయాలి. పన్నుల పేరుతో ఎలా బాదుతున్నారో చర్చించాలి. రకరకాల పన్నులపై చర్చించాలి. అవసరమైతే పార్లమెంటులో ప్రత్యేకంగా చర్చించే ధైర్యం చేయాలి. బ్యాంకుల రుణ వితరణలో లక్ష కోట్ల రూపాయల తరుగుదల కనిపించిందని రిజర్వుబ్యాంకు వెల్లడించడం గమనిస్తే, గిరాకీ మందగించడం వల్లనే కొత్త పరిశ్రమలు, వ్యాపారాలను పెట్టడానికి రుణాలు తీసుకునేవారు కరవవుతున్నారని స్పష్టమవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తరచూ మాంద్యానికి గురవుతూనే ఉంటుంది. అది సహజ పరిణామం కూడా. ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు ఒక సరళ సూత్రాన్ని పాటించి విజయం సాధించాయి. భారత్ కూడా అలాంటి ఉద్దీపన విధానాన్ని చేపట్టాలి. కొన్ని రంగాలు తమ సామర్థ్యం మేరకు ఉత్పత్తి సాగించలేక పోయాయి. ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచితే ఆర్థిక వ్యవస్థలోకి ధన ప్రవాహం, దానితోపాటే గిరాకీ పెరిగి, పరిశ్రమలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత ఎక్కువగా వినియోగించుకుంటాయి. దీనికి ఉద్దీపనలు ఇవ్వాలే తప్ప కొందరు కార్పోరేట్లకు రుణాలను మాఫీచేయడం, ఎగవేతదారుల రుణాలను మాఫీ చేయడం దేశ అభివృద్ధి కాదు. అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడే భాగ్యం కలిగిందని సంతోషపడుతున్న వేళ రూపాయితో పోల్చు కుంటే మనం ఎప్పటికీ బలహీనంగానే ఉంటున్నాం. బలహీన దేశాలైన సూడాన్ లాంటి దేశాల్లో మాత్రమే మనం బలవంతులం. 75ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న వేళ వెనక్కి తిరిగి చూస్తే మన ఆర్థిక ప్రగతి బలపడిందా లేక బలహీన పడిందా అన్నది రూపాయిని అడిగితే చెబుతుంది. ప్రధానంగా మనం రూపాయిని డాలర్‌తో పోలిస్తేనే మన బలం గురించి తెలుస్తుంది. డాలర్ మనకు అందనంతగా ఎదిగి పోతోంది. ఇది డాలర్ బలమో లేక మన రూపాయి బలహీనతో కానీ పాలకులు మాత్రం ఘనంగా అభివృద్ధి గురించి ఢంకా బజాయిస్తున్నారు. అంతెందుకు నోట్ల రద్దు జరగక ముందు ఉన్న 500 రూపాయల విలువ ఇప్పుడు కొత్త రెండు వేల నోటుకు లేదంటే నమ్మగలమా? కానీ నమ్మాలి. ఆనాటి 500 నోటు ఇవాళ్టి రెండు వేల నోటు ఒకటే అన్న సంగతి బజారులో అడుగుపెడితే సామాన్యుడే చెబుతాడు. ప్రతి భారతీయుడికి ఇల్లు, విద్యుత్తు, గ్యాస్, నీరు, మరుగుదొడ్డి, నైపుణ్యాభి వృద్ధి, వైద్యం, బీమా వంటి సౌకర్యాలు అందాలి. దేశాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పడం కాదు చేసి చూపాలి. అప్పుడే దేశం పురోగమిస్తుంది.

పృధ్వీరాజ్ గోసుకొండ
ఎడిటర్

# ఫ్లోరైడ్ రహిత ప్రాంతంగా మునుగోడు


తెలంగాణలో మిషన్ భగీరథతో నీళ్లిచ్చిన సిఎం ● పెన్షన్ల మంపిణీలో మంత్రిజగదీశ్ రెడ్డి



**నల్గొండ, అగస్టు 17 (సమ సమాజం):** దేశంలో ఎక్కడా లేనివిధంగా మునుగోడులోనే 15శాతం మంది దివ్యాంగులున్నారని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాపమంతా గత పాలకులదేనని ఆరోపించారు. ఈ ప్రాంత బిడ్డలు ఫ్లోరైడ్ రక్కసితో అవిటివారిగా మారినా గత పాలకులు పట్టించుకోలేదని మండిపడ్డారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆయన బుధవారం నూతన పెన్షన్ లబ్దిదారులకు కార్డులు అందేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 40లక్షల మందికి సీఎం కేసీఆర్ పెన్షన్ అందిస్తున్నారన్నారు. ఉద్యమ సమయంలో నియోజకవర్గంలోని ఫ్లోరైడ్ బాధితులను చూసి సీఎం చలించిపోయారన్నారు. పాలకులు పట్టించుకోకపోతే మునుగోడు నియోజకవర్గంలో ఫ్లోరైడ్ పెరిగి జనాలు లేని నియోజకవర్గంగా మారుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్య సమితి హెచ్చరించిందని, స్వరాష్ట్రం ఏర్పాటు కావాలని కేసీఆర్ భావించారని తెలిపారు. మిషన్ భగీరథ పథకాన్ని నియోజకవర్గంలోని చౌటుప్పల్ నుంచే ప్రారంభించారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన ఆరేళ్లలోపే ఫ్లోరైడ్ సమస్యను లేకుండా చేశారన్నారు. పారమెంట్ సాక్షిగా మునుగోడులో కొత్త ఫ్లోరైడ్ బాధితులు లేరని పేర్కొనడం సీఎం సాధించిన విజయమేనన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మందికి, నియోజకవర్గంలో 40వేల మందికి ఆసరా పెన్షన్లు అందుతున్నాయని స్పష్టం చేశారు. ఫ్లోరైడ్ సమస్యపై ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలు ఎన్నో ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. ఉద్యమనాయకుడిగా సీఎం కేసీఆర్ ఫ్లోరైడ్ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోలేదని చెప్పారు. ప్రపంచ జనాభాలో 15శాతం దివ్యాంగులు ఉన్న నియోజకవర్గం.. మునుగోడు నియోజకవర్గం అని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 46 లక్షల మందికి ఆసరా పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్‌లో ఆసరా పెన్షన్‌ను పంపిణీ చేసిన ఆయన..ఒక్క మునుగోడులోనే 40 వేల మందికి ఆసరా పెన్షన్లు అందుతున్నాయని చెప్పారు.కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ ఛైర్మన్ రాజు, సింగిల్ విండో ఛైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# మేక్ ఇండియా నంబర్ వన్

మారుమూల ప్రాంతాలకు సైతం విద్య,వైద్యం
విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయంపై ప్రధాన దృష్టి
75ఏళ్లలో ఎంతో సాధించినా..ప్రజల్లో ఆగ్రహం తగ్గలేదు
యువశక్తిని ముందుకు తీసుకుని వెళ్లాల్సి ఉంది
అన్నిపార్టీలు తనతో కలసి రావాలన్న కేజ్రీవాల్
ఢిల్లీలో కార్యక్రమం ప్రారంభోత్సవంలో సిఎం కేజ్రీవాల పిలుపు



**న్యూఢిల్లీ, అగస్టు 17 (సమ సమాజం):** భారత దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, ప్రథమ స్థానంలో నిలిపేందుకు తనతో కలిసి రావాలని అన్ని రాజకీయ పార్టీలను ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కోరారు. తనతో కలసి అడుగు వేయాలన్నారు. యావత్తు దేశ సర్వతోముఖాభివృద్ధిపై దృష్టి సారించారు. ఈ లక్ష్యం కోసం మేక్ ఇండియా నెం.1 అనే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ, దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ పాఠశాలలను నిర్మించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలకు పిలుపునిచ్చారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయంపై ప్రధాన దృష్టితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు అన్ని రాజకీయ పార్టీలు తనతో కలిసి రావాలన్నారు. మేక్ ఇండియా నెంబర్ వన్ మిషన్ ద్వారా దేశంలోని 130 కోట్ల మంది భారతీయులను అనుసంధానం చేస్తామన్నారు. భారత దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 75 సంవత్సరాలు అయిందని, ఈ సమయంలో ఎంతో సాధించామని, అయినా ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని చెప్పారు. ఈ కాలంలో చాలా చిన్న దేశాలు మన కన్నా ముందుకు దూసుకెళ్ళాయనే భావన ఉందని చెప్పారు. 7 కోట్ల మంది బాలలకు మంచి, ఉచిత విద్యను అందజేయాలన్నారు. పర్వతాలు, గిరిజన ప్రాంతాల్లో పాఠశాలలను ఏర్పాటు చేయలేమని మనం చెప్పకూడదన్నారు. ఎంత ఖర్చు అయినప్పటికీ, ఈ పనిని చేయాలన్నారు. ఓ బాలుడు లేదా బాలిక తన కుటుంబాన్ని పేదరికం నుంచి బయటపడేసి, ధనిక కుటుంబంగా మార్చగలరన్నారు. అలాంటపుడు సంపన్న దేశాల జాబితాలో భారత దేశం చేరుతుందని చెప్పారు. మనం దృష్టి సారించవలసిన రెండో అంశం, ప్రజలకు మెరుగైన, ఉచిత వైద్య చికిత్సను అందజేయడమని చెప్పారు. మనం కృషి చేయవలసిన మూడో అంశం యువశక్తి అని తెలిపారు. యువశక్తి మనకుగల అద్భుతమైన బలమని చెప్పారు. నేడు యువత నిరుద్యోగులుగా ఉండిపోతున్నారని, యువతకు ఉపాధి కల్పించాలని అన్నారు. అందుకే దేశం నలుమూలలా స్కూళ్లను నిర్మించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కేజ్రీవాల్ పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ సహా ఇతర రాజకీయ పార్టీలన్నీ తాను చేపట్టిన మిషన్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తన మిషన్ ప్రధానంగా విద్య, వైద్య, సేద్య రంగాలపై దృష్టిసారిస్తుందని చెప్పారు. ఈ మిషన్ ద్వారా 130 కోట్ల భారతీయులను ఏకతాటిపైకి తీసుకువస్తానని తెలిపారు. మనం 75 ఏండ్ల స్వాతంత్య్ర ఫలాలను అనుభవిస్తున్నాం..మనం ఎంతో సాధించినా ప్రజలు ఇంకా కడగండ్లకు లోనవుతూ పాలకులపై ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. స్వాతంత్య్రం సిద్ధించిన వెంటనే ఎన్నో చిన్న దేశాలు అభివృద్ధిలో మనకంటే వేగంగా పరుగులు పెట్టాయని గుర్తుచేశారు. మనం దేశవ్యాప్తంగా 27 కోట్ల మంది చిన్నారులకు మెరుగైన, ఉచిత విద్యను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కుటుంబానికి చెందిన ఓ చిన్నారి వారి కుటుంబాన్ని పేదరికం నుంచి సంపన్నులుగా మార్చ గలదని, ఇది విద్యతోనే సాధ్యమని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. దీనికోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు వెనుకాడరాదని పిలుపు ఇచ్చారు. అప్పుడే భారత్ పేరు సంపన్న దేశాల జాబితాలోకి చేరుతుందని పేర్కొన్నారు. ఇక మెరుగైన, ఉచిత వైద్యం అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా చూడటం అత్యవసరమని స్పష్టం చేశారు. విశ్లేషకుల కథనం ప్రకారం, గుజరాత్ శాసన సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అరవింద్ కేజ్రీవాల్ కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఢిల్లీలో పాగా వేసిన ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్‌ను కూడా కైవసం చేసుకోవడంతో ఆ పార్టీలో గొప్ప ఉత్సాహం వెల్లివిరుస్తోంది. ఇక గుజరాత్‌ను సొంతం చేసుకోవడమే లక్ష్యంగా కేజ్రీవాల్

# తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ

తెలంగాణలో ఇక వచ్చేది బిజెపి ప్రభుత్వమే
మునుగోడులో విజయం సాధించి తీరుతాం
21న మునుగోడులో అమిత్ షా బహిరంగ సభ
అదేరోజుపార్టీలో చేరనున్న రాజగోపాల్ రెడ్డి
పీఠం కదలడంతోనే బండి సంజయ్‌పై దాడి
బిజేపీ తెలంగాణ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్



**హైదరాబాద్, అగస్టు 17 (సమ సమాజం):** తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ కు రాజ్యాంగంపై నమ్మకం లేదన్నారు. కేసీఆర్ తన సొంత రాజ్యాంగం రచించాలని అనుకుంటున్నారని మండిపడ్డారు. బండి సంజయ్ యాత్రపై జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని అన్నారు. సీఎం కేసీఆర్‌కు అధికారాన్ని కోల్పోతున్నాం అన్న భయం పట్టుకుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని... అందుకే కేసీఆర్ బీజేపీ అంటే భయపడుతున్నారని తెలిపారు. బండి సంజయ్ యాత్రపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంజయ్ ప్రజా సంగ్రామ యాత్రకు నిరాటకంగా జరిగేలా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి అమిత్ షా ఈ నెల 21న తెలంగాణ లో పర్యటిస్తారని తెలిపారు. అదే రోజు అమిత్ షా మునుగోడులో సాయంత్రం 4 గంటలకు భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. అదే సభలో రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించారు. ఇంకా ఇతర పార్టీలకు చెందిన చాలా మంది ప్రముఖులు బీజేపీలో చేరనున్నారని ప్రకటించారు. ప్రధాని పంద్రాగస్టు ప్రసంగంలో పసలేదన్న కేసీఆర్ వ్యాఖ్యలను తరుణ్ చుగ్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ సాయంత్రం చేసే ప్రసంగాలపై ఎక్కువ స్పందించడం అనవసరమన్నారు. మునుగోడులో ప్రజల ఆశీర్వాదం బీజేపీకే ఉంటుందన్నారు. తెలంగాణకు అవినీతి, వంశ పారపర్యంగా వచ్చే రాజకీయాలే శత్రువులని అన్నారు. తెలంగాణ ప్రజలకు కేసీఆర్ పాపాల నుంచి త్వరలో విముక్తి లభిస్తుందన్నారు. ఆంగ్లేయులు, ఇందిరాగాంధీ లాగానే కేసీఆర్ పాలన ఉందని... త్వరలో ప్రజలు ముంగింపు పలుకుతారని తెలిపారు. రేపు 4 గంటలకు కోరుట్లలో పెద్ద ఎత్తున బీజేపీలో చేరికలు ఉంటాయని తరుణ్ చుగ్ ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రను అడ్డుకునేందుకు సీఎం కేసీఆర్ కుట్రలు చేస్తున్నారంటూ చుగ్ మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ చేపడుతున్న సభలు, సమావేశాలను అడ్డుకోవాలని టీఆర్‌ఎస్ సర్కారు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. అధికారం చేజారిపోతుందన్న ఆందోళనలో కేసీఆర్ ఉన్నారని, అందుకే ప్రజా సంగ్రామ యాత్రపై టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో దాడులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వ్యవహరి స్తున్న తీరు సరిగ్గా లేదని, శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపైనే ఉందన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, ఆయనకు అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంపై కూడా విశ్వాసం లేదని పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీన మునుగోడులో నిర్వహించే బహిరంగ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరుకానున్నారని తరుణ్ చుగ్ చెప్పారు. ఇతర పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరుతారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్యాయం చేస్తోందని, కేసీఆర్ పరిపాలనలో జరుగుతున్న అన్యాయాలపై అమిత్ షా మాట్లాడుతారని చెప్పారు. దుబ్బాక, హుజురాబాద్ నియోజకవర్గాల్లో గెలిచినట్లుగానే మునుగోడులోనూ బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ సాయంత్రం పూట మాట్లాడే మాటలకు నేను సమాధానం ఇవ్వను. సాయంత్రం అయితే ఏం జరుగు తుందో అందరికీ తెలుసు' అని తరుణ్ చుగ్ అన్నారు. కోరుట్లలో గురువారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సభలో చాలామంది నేతలు బీజేపీలో చేరబోతున్నారని తెలిపారు. మునుగోడు ఉపఎన్నిక నేపథ్యంలో కోరుట్ల సభ చాలా కీలకమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయ మన్నారు. రాష్ట్రంలో గత ఏడాదిగా ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్న ప్రజా ఆందోళనను అడ్డుకోవడా నికి సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని తరుణ్ చుగ్ ఆరోపించారు. బండి సంజయ్ ను పోలీసులు ఆయన కార్యాలయం నుంచి లాఠీ ఛార్జ్ చేసి తీసుకెళ్లారని చెప్పారు. నిజామాబాద్‌లో అభివృద్ధి పనులు చేయ కుండా ఎంపీ ధర్మపురి అర్వింద్ ను అడ్డుకుంటున్నారని, నియోజకవర్గంలో తిరగనివ్వకుండా దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో చేపట్టిన రోడ్ల నిర్మాణాల్లో కేంద్ర నిధులు ఉన్నాయని, ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు.

# కేసీఆర్ కిట్‌తో పెరిగిన ప్రసవాలు

**జనగామ, అగస్టు 17 (సమ సమాజం):** కెసిఆర్ కిట్ పథకంతో ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందని స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య అన్నారు. ప్రభుత్వం ఆస్పత్రులకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించి, అవసరమైన సాంకేతిక పరికరాలు అందించి సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషిచేస్తోందన్నారు. సర్కార్ దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య పెరిగేందుకు తల్లీబిడ్డల సంరక్షణకు ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకం కింద జిల్లాలో ప్రసూతి పొందిన స్త్రీలకు 15 రకాల వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్‌తో పాటు ఆడపిల్ల పుడితే 13వేలు, మగపిల్లవాడయితే రూ.12వేల అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా అనేక మంది దేశ, విదేశ పర్యాటకుల దృష్టి పడి వారి సందర్శనతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయనడంతో ఎలాంటి సందేహం లేదన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో పలు పర్యాటక ప్రాంతాలకు మంజూరు చేసిన పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు.

# కెసిఆర్ కుటుంబంతోనే తెలంగాణ రాలేదు

అందరం కలిసే ఉద్యమించామని గుర్తించుకోవాలి ❍ ఫాంహౌజ్‌లో పడుకుంటే పథకాలు గుర్తుకు రావు ❍ కెసిఆర్ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి చంద్రశేఖర్




**హైదరాబాద్, అగస్టు 17 (సమ సమాజం):** కేసీఆర్ కుటుంబం మాత్రమే ఉద్యమం చేస్తే తెలంగాణ రాలేదని ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. ఇళ్ళ నిర్మాణం కోసం కేంద్రం ఇచ్చిన నిధులను కేసీఆర్ కుటుంబం దాచుకుందన్నారు. ఫాంహౌస్ లో పడుకునే కేసీఆర్‌కు కేంద్ర పథకాలు గుర్తులేవన్నారు. బీజేపీ కార్యకర్తలపై టీఆర్‌ఎస్ చేస్తోన్న దాడులకు కచ్చితంగా బదులు తీర్చుకుంటామన్నారు. ప్రధాని మోడీకి ముఖం చూపించే ధైర్యం లేకనే కేసీఆర్ నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని అన్నారు. వికారాబాద్ ప్రాంతానికి ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా కేసీఆర్ అమలు చేయలేదని తెలిపారు. ఏపీ సీఎం నీళ్ళు తరలించుకుపోతుంటే కేసీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ వలనే దక్షిణ తెలంగాణ ఏడాదిగా మారిందని ఆయన వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... ఒక సన్నాసి ముఖ్యమంత్రిగా ఉండటం తెలంగాణ ప్రజల దౌర్భాగ్యమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిగ్గు, శరం లేదని తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజక్ట్ కమిషన్ పైసలు కేసీఆర్ ఎక్కడ దాచాడో కేంద్రం దగ్గర సమాచారం ఉందన్నారు. ఉచిత ఎరువులు ఇవ్వటానికే పుట్టానన్న కేసీఆర్.. రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం మాత్రమే ఉద్యమం చేస్తే.. తెలంగాణ రాలేదన్నారు. ఉద్యమ దొంగలను పక్కన పెట్టుకుని కేసీఆర్ రాజ్యమేలుతున్నారని మండిపడ్డారు. బంగారు తెలంగాణ అనటానికి కేసీఆర్ కు సిగ్గుపడాలన్నారు. ఇళ్ళ నిర్మాణం కోసం కేంద్రం ఇచ్చిన నిధులను కేసీఆర్ కుటుంబం దాచుకుందని అన్నారు. తాగి ఫాంహౌస్‌లో పడుకునే కేసీఆర్‌కు కేంద్ర పథకాలు గుర్తు లేవన్నారు. బీజేపీ కార్యకర్తలపై టీఆర్ఎస్ చేస్తోన్న దాడులకు ఖచ్చితంగా బదులు తీర్చుకుంటామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీకి ముఖం చూపించే ధైర్యం లేకనే కేసీఆర్ నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్ళలేదన్నారు. కాళేశ్వరం ప్రాజక్టుతో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని ఏ.చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. ఉచిత ఎరువులు ఇస్తామని చెప్పి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. ఉద్యమ దొంగలను పక్కన పెట్టుకుని కేసీఆర్ రాజ్యమేలుతున్నారని చంద్రశేఖర్ ఆరోపించారు.

# సాగర్ డ్యాంపై ప్రమాదం

(మొదటి పేజి తరువాయి) ఫ్యాన్ రెక్క ముక్క మోకాలి కింది భాగంలోనే ఉండిపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం గాయపడిన సిబ్బందిని హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అనుకోకుండా సాంకేతికపరమైన కారణాలతో జరిగిన దుర్ఘటన అని, గాయపడిన అజ్మతుల్లాకు మెరుగైన చికిత్స అందిస్తామని తెలిపారు.

# ఒకే ఇంట్లో ఆరు మృతదేహాలు

### అనుమానస్పద కేసుగా దర్యాప్తు



**శ్రీనగర్, అగస్టు 17 (సమ సమాజం):** జమ్మూ కశ్మీరులోని ఓ ఇంట్లో బుధవారం ఉదయం ఆరుగురి మృతదేహాలు లభించడం సంచలనం రేపింది. జమ్మూ నగరంలోని సింద్రా ప్రాంతంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లీ, ఇద్దరు కుమార్తెలతో కలిసి మొత్తం ఆరుగురి మృతదేహాలు లభించాయి. ఒక ఇంట్లో ఆరుగురి మృతదేహాలున్నాయనే సమాచారం మేర జమ్మూ పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు. మరణించినవారిలో సకీనా బేగం, ఆమె ఇద్దరు కూతుళ్ల నసీమా అఖ్తర్, రుబీనా బానో, కుమారుడు జఫర్ సలీం, మరో ఇద్దరు బంధువులు నూరుల్ హబీబ్, సజాద్ అహ్మద్ లున్నారు. వారి మరణానికి కారణాలు తెలియదని, పోస్టుమార్టం రిపోర్టులో వాస్తవాలు వెలుగుచూస్తాయని పోలీసులు చెప్పారు. అయితే ఒకే ఇంట్లో ఆరుగురు అనుమానాస్పద స్థితిలో మరణించారని పోలీసులు వివరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కానరావడం లేదు. మనవాళ్లను

# జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పు రావాలి

ఇలాగే ఉంది. అందుకే ఈ విషయాన్ని పదే పదే (మొదటి పేజి తరువాయి) చెప్తున్నా. ఆదిలాబాద్ గోండు గూడెంలో, వరంగల్ లంబాడీ తండాలో, హైదరాబాద్ బంజారా హిల్స్‌లో ఎక్కడైనా సరే 24 గంటలూ ఉంటుంది. ఇంతకుముందు చాలా మంది కేసీఆర్ కన్నా దొడ్డుగున్నోళ్లు, పొడుగున్నోళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు. వాళ్ళెందుకు కరెంటు ఇవ్వలేదు? ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన ఉంటే మెదడు రంగరించి ఫలితాలు సాధిస్తారు. ఒకప్పుడు మంచి నీళ్ల కోసం నానా తంటాలు పడేవాళ్లు. ట్యాంకర్ల వెంటపడేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అంతకు ముందు కలెక్టరేట్ వద్దకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు జిల్లా నేతలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా త్రివర్ణ బెలూన్లను ఎగుర వేశారు. మేడ్చల్‌లో గ్రామీణ ప్రాంతాలు తక్కువ. దాంతో ఇక్కడ పరిశ్రమలు వస్తాయి. ఉపాధి దొరుకుతుంది. రియల్ ఎస్టేట్ పెరుగుతుంది. వీటి వల్ల చాలా పనులు చెయ్యాల్సి వస్తుంది. వీటికోసం అందరు ఎమ్మెల్యేలకు రూ.5 కోట్ల నిధులు ఇచ్చాం. ఇవి చాలడం లేదని ఎమ్మెల్యేలు చెప్పారు. అందుకే ఈ ఏడు నియోజక వర్గాల ఎమ్మెల్యేలకు మరో రూ.పది కోట్ల నిధులు మంజూరు చేస్తున్నా. రేపే దీనికి సంబంధించి జీవో విడుదల చేస్తా. ఇలా మనకు నిధులు ఉన్నాయి. కానీ కొందరు మూర్ఖులు కారుకూతలు కూస్తున్నారని అన్నారు. తెలంగాణ ధనిక రాష్ట్రమని నేను ఎప్పుడో చెప్పా. ఎందుకంటే మనకున్న వనరులు అలాంటివి. ఒక రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కొలిచే విధానంలో రెండు ముఖ్యమైన విషయా లుంటాయి. వాటిలో ఒకటి తలసరి ఆదాయం. ఒకప్పుడు ఇది కేవలం రూ.లక్షగా ఉండేది. ఇప్పుడు ఇండియాలో నెంబర్‌వన్‌గా రూ.2,78,500కు పెరిగింది. మనకన్నా ముందే రాష్ట్రాలుగా ఉన్న మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్‌లను మనం దాటేశాం. ఇది వట్టిగానే జరుగుతుందా? అవినీతి రహితంగా అనుకున్నది అనుకున్నట్లు చేస్తేనే ఇది సాధ్యం అవుతుంది. తెలంగాణ ఇంత అభివృద్ధి చెందడం చూసి దేశమంతా ఆశ్చర్యపోతుంది. తెలంగాణ రాష్ట్రం అయితే ప్రభుత్వ ఉద్యోగులకు దేశంలోనే ఉత్తమమైన జీతాలు దొరుకుతాయని చెప్పా. ఇప్పుడు మన ప్రభుత్వోద్యోగులే దేశంలో అత్యధిక జీతాలు పొందుతున్నారు. పేద పిల్లల పెళ్లిళ్లు జరిగితే ఏ రాష్ట్రంలోనైనా రూ.లక్ష ఇస్తున్నారా? ఇప్పటికే పదకొండు లక్షల కుటుంబాలకు రూ.9వేల కోట్లపైగా ఖర్చు చేశాం. దేశంలో మరెక్కడా ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు పెన్షన్లు ఇవ్వరు. వికలాంగ సోదరులకు రూ.3016 ఇచ్చే రాష్ట్రం కూడా తెలంగాణ ఒక్కటే. ఈ మధ్యనే డయాలసిస్ పేషెంట్లకు కూడా ఆసరా పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించాం. వీళ్లకే కాదు చేనేత, గీత కార్మికులకు, బోదకాలు బాధితులకు ఇలా ఎంతోమందికి ఇస్తున్నం. చాలామంది తెలంగాణ పల్లెల్లో ఏమమ్మా ఎలా ఉన్నావ్? అనడిగితే.. హైదరాబాద్‌లో నా పెద్దకొడుకు కేసీఆర్ ఉన్నాడు. డబ్బులు పంపిస్తాడని చెప్తున్నారు. అందుకే చాలా మంది కోడళ్లు అత్తమామల్ని ఇంటికి తెచ్చి పెట్టుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ముసలాళ్లే మోతుబరిగా ఉన్నారు. నేను పంపే డబ్బులో కూడా ఎంతో కొంత దాచుకుంటున్నారు. బియ్యానికి కూడా గతంలో ఇంట్లో ముగ్గురు, నలుగురికే ఇస్తామనే వారు. ఇప్పుడు ఎంత మంది ఉంటే అంతమందికి నాలుగు కాకుండా ఆరు కిలోలు ఇస్తున్నాం అని వివరించారు. మన వనరులు మనకే దక్కడంతో ఆర్థికంగా మనం పెరిగినట్టు కెసిఆర్ వెల్లడించారు. జీఎస్‌డీపీ అంటే రాష్ట్ర స్థూలఉత్పత్తి. ఇది కూడా ఒక గీటురాయి. ఇది 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.5 లక్షలకోట్లు ఉండేది. ఇయ్యాల అది అద్భుతంగా పెరిగి రూ.11.5 లక్షలకోట్లకు చేరింది. అధికారులు అంకితభావం, ప్రజాప్రతినిధుల చిత్తశుద్ధి, ప్రభుత్వం లక్ష్యశుద్ధి వల్లే ఇది సాధ్యమైంది. చాలా రాష్ట్రాల్లో ఇప్పుడు మనం ప్రారంభించుకున్న కలెక్టరేట్ వంటి భవనాలు కూడా లేవు. మొత్తం 33 జిల్లాల్లో వీటితోపాటు పోలీసు భవనాలు కూడా తీసుకొస్తున్నామన్నారు. దేశంలోనే అత్యధిక గురుకులాలు ఉన్న రాష్ట్రం కూడా మనదే. వీటిలో చదువుకుంటున్న పేద విద్యార్థులు దేశం ఆశ్చర్యపోయే ఫలితాలు సాధిస్తున్నారు.. కరోనా రాకుంటే మరిన్ని గురుకులాలు పెంచేవాళ్లం. ఈ మధ్య బీసీల కోసం కొన్ని పెంచినా.. మరిన్ని పెంచాల్సిన అవసరం ఉంది. మిషన్ భగీరథ ద్వారా మంచి నీళ్ల కొరత కూడా తీర్చుకున్నాం. ఒకప్పుడు మన రాష్ట్రం నుంచి కూలీల కోసం పోయేవారు. ఇప్పుడు పన్నెండు రాష్ట్రాల నుంచి ఇక్కడకు బతుకుతెరువు కోసం వస్తున్నారు. వాళ్లందరికీ పని కల్పించే అద్భుతమైన రాష్ట్రంగా మనం ఎదిగాం. ఉద్యమకాలంలో ఏది కావాలని కోరుకున్నామో అది సాధించుకున్నాం అని కేసీఆర్ పేర్కొన్నారు. పరిపాలన వికేంద్రీకరణతో ప్రజలకు వేగంగా సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఎవరూ మేడ్చల్ జిల్లా అవుతుందని ఏనాడూ కల కూడా కనలేదన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం వల్ల కలిగిన శుభపరిణామం. పరిపాలన ప్రజలకు ఎంత దగ్గరకు వస్తే అంత చక్కగా పనులు జరిగే అవకాశం ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న సమయంలో జిల్లా చేసే సందర్భంగా పెద్దగా చెర్చ జరిగింది. మూడు జిల్లాలు అవుతాయని చెప్పారు. వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ కావొచ్చు.. అలా చేస్తే భవిష్యత్‌లో బాగుంటుందని పెద్దలు చెప్పడం, ప్రజాప్రతినిధులు, మంత్రులు కోరడం.. జనాభాను పరిశీలించినప్పుడు చాలా పెద్ద జిల్లాగా ఉండడం, పరిపాలన సౌలభ్యం గొప్పగా ఉండాలంటే, ప్రజలకు అన్నీ మంచి పనులు నెరవేరాలంటే తప్పకుండా మేడ్చల్ జిల్లా కావాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగానే 33 జిల్లాలు వచ్చినయ్. రైతులు వేదికలు ఏర్పాటు చేయాలంటే మన రాష్ట్రంలో మన వ్యవసాయ భూమిని ప్రతి 5వేల ఎకరాలకు క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, ఒక్కో వ్యవసాయాధికారిని నియమించాం. 2601 క్లస్టర్లు అయ్యాయి. వాటన్నింటికి కూడా పేరుకే రైతులు కానీ.. కూర్చుకునేందుకు వేదిక లేదని చెప్పి.. ఆరేడు నెలల్లో నిర్మించాం. పరిపాలన వికేంద్రీకరణ జరిగిందింది కాబట్టి.. అంత సులభంగా భవనాలు కట్టుకోగలిగాం. రాష్ట్రంలో ఇప్పటికే 11వేల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుకాబోతున్నాయి. రాష్ట్రంలో తీసుకున్న కార్యక్రమాల ప్రజలకు చకాచకా ప్రజలకు వేగంగా అందుతున్నయ్. ఇవాళ మనం ఇచ్చే సంక్షేమ కార్యక్రమాలు.. దివ్యాంగులు, మహిళలు, వృద్ధులు, ఒంటరి మహిళలకు ఇచ్చే పెన్షన్లు అద్భుతంగా ఈ రోజు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా దళారీల ప్రమేయం లేకుండా కార్యాలయాల చుట్టూ తిరిగే అవకాశం లేకుండా ఠంచన్‌గా వారందరికీ అందుతున్నయన్నారు. రాష్ట్రంలో 36లక్షల పెన్షన్లు ఉన్నయ్. మరో 10లక్షల పెన్షన్లు ఆగస్టు 15 నుంచి పంచుతున్నం. కరోనాతో కొంత ఆలస్యమైంది. 57 సంవత్సరాల వారికి ఇస్తామని చెప్పాం. కరోనాతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తికమక అయిన పరిస్థితుల్లో కొంత ఆలస్యమైంది. ఇచ్చినమాటను నిలబెట్టుకుంటే 46లక్షలకు పెన్షన్లు చేరుకుంటున్నయ్. ఈ 46లక్షల పెన్షన్‌దారులకు అద్భుతమైన కొత్త కార్డులు ఎలక్ట్రానిక్ బార్‌కోడ్లతో పంపిణీ చేస్తున్నారు. రాబోయే వారం పదిరోజుల్లో ఎమ్మెల్యేలు పంపిణీ చేస్తారని, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని' సీఎం కేసీఆర్ కోరారు.

ఘటనను భాజపా రాష్ట్ర

# జనగామ జిల్లాలో కొనసాగిన సంగ్రామ యాత్ర



(మొదటి పేజి తరువాయి) అధ్యక్షుడు బండి సంజయ్‌తోపాటు, పార్టీ రాష్ట్ర వ్యవహారా ఇంఛార్జ్ మాణిక్కం ఠాగూర్ ఖండించారు. తాము మొదటి నుంచి చెబుతున్నంటే తెరాస పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో పోలీసులు కూడా రౌడీల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పాదయాత్రకు రక్షణ ఉండి.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాల్సిన పోలీసులు గొడవ జరుగుతోంటే మిన్నకుండి పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు యాదాద్రిలో ప్రారంభించిన ఈ యాత్రలో బండి సంజయ్ ఊరూరా తిరుగుతూ తెరాస పాలనను ఎండగట్టారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు పనితీరును విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, రాష్ట్ర ఆరోగ్య రంగం పనితీరుపై విమర్శలు చేశారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల వారికి అన్యాయం జరిగిందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. అలాగే బండి సంజయ్ పాదయాత్ర చేయబోయే గ్రామాల్లో బీజేపీ, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. జనగామ నుండి సూర్యాపేట వెళ్లే దారిలో బీజేపీ నాయకులు రోడ్డు కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. అయితే.. గుర్తు తెలియని వ్యక్తులు వీటిని చించివేశారు. కావాలనే టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ ఫ్లెక్సీలను, బ్యానర్లను తొలగించారని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. మరోవైపు బండి సంజయ్ పాదయాత్ర గురువారం జనగామ చేరుకోనుంది. జనగామ ఆర్టీసీ చౌరస్తాలో కార్యకర్తలు పోటాపోటీగా ఫ్లెక్సీలు, హోర్డింగ్ లు ఏర్పాటు చేశారు. జిల్లాలో పర్యటించాలంటే కేంద్ర నిధులపై బండి సంజయ్ స్పష్టత ఇవ్వాలంటూ టీఆర్ఎస్ నేతలు ప్రత్యేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మొత్తంగా బండి సంజయ్ పాదయాత్ర నేపథ్యంలో పలు చోట్ల టీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల మధ్య పోటా పోటీ ఫ్లెక్సీలు ఏర్పాటవుతున్నాయి. మరోవైపు పలు గ్రామాల్లో టీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి.

# 6 లక్షల గణేష్ విగ్రహాలను పంపిణీ

(మొదటి పేజి తరువాయి) హైదరాబాద్,అగస్టు17(ఆర్ఎన్ఎ): ఈ నెల 31న గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, వచ్చే నెల సెప్టెంబరు 9న గణేశ్ నిమజ్జనం నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 4 లక్షలు, పీసీబీ ఆధ్వర్యంలో లక్ష, హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో లక్ష చొప్పున మొత్తం 6 లక్షల గణేశ్ విగ్రహాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఖైరతాబాద్ గణేశ్‌ను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో బారికేడ్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెల 24న అధికారులతో కలిసి ఖైరతాబాద్ గణేశ్ మండపాన్ని సందర్శిస్తామన్నారు. విగ్రహాల నిమజ్జనం కోసం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 25 పాండ్‌లకు అదనంగా మరో 50 పాండ్‌ను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. విగ్రహాల ఊరేగింపు రహదారుల్లో అవసరమైన చోట్ల మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపడతామన్నారు. సెప్టెంబరు 9న నిర్వహించే గణేశ్ నిమజ్జనానికి సుమారు 8 వేల మంది జీహెచ్ఎంసీ సిబ్బంది మూడు షిఫ్ట్‌ల్లో విధుల్లో ఉంటారని చెప్పారు. గణేశ్ నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించేలా సహకరించాలన్నారు. సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, విద్యుత్ శాఖచీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ, ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవిగుప్తా, అదనపు డీజీపీ జితేందర్, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, పీసీసీబీ మెంబర్ సెక్రటరీ నీతూ కుమారి ప్రసాద్, పోలీస్ కమిషనర్లు సీవీ ఆనంద్, మహేష్ భగవత్, స్టీఫెన్ రవీంద్ర, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, కలెక్టర్ అమయ్ కుమార్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారి రఘోత్తంరెడ్డి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు భగవంతరావు, రాఘవరెడ్డి, ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధి సుదర్శన్, సికింద్రాబాద్, గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

# రూపాయికి శస్త్ర చికిత్స చేయాల్సిందే

(మొదటి పేజి తరువాయి) అమెరికా పంపించాలంటేనే భయం వెన్నాడుతోంది. చదువుకునేందుకు వెళ్లే పిల్లలకు రూపాయలను బస్తాల్లో పంపినా అక్కడ పిడికెడు డాలర్లు రావడం లేదని వాపోతున్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య చరిత్రలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి దిగజారిపోయి రూపాయి విలపిస్తుండగా, నిత్యావ సరాల ధరలు పెరిగి, ఆర్థిక వ్యవస్థ కుదేలవుతున్న తీరు ఎక్కడా ప్రధాని మోడీ ప్రసంగంలో కానరావడం లేదు. 1947లో రూపాయి విలువ డాలర్‌తో సమానం. అంటే ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతావనిలో మనం బాగా అభివృద్ధి సాధించామని ఈ రకంగా పోల్చుకోవాలేమో. డాలర్‌తో రూపాయి మారకం దారుణంగా మారింది. అమెరికా, టర్కీల మధ్య తలెత్తిన విభేదాల నేపథ్యంలో టర్కీ కరెన్సీ అయిన లిరా ఒడిదుడుకుల కు గురికావడంతోనే ఇంతటి పెను మార్పులని అప్పట్లో ఆర్థికమంత్రిగా ఉన్న అరుణ్ జైట్లీ సెలవిచ్చారు. అంటే ప్రపంచంలో ఏ దేశంలో ఏ ఉపద్రవం వచ్చినా మన రూపాయి తట్టుకుని నిలబడేంత బలంగా లేదు. ఇంతటి బలహీనమైన రూపాయి ఎప్పుడు బలపడుతుందా అన్నదే అనుమానం. సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలు వచ్చాక ద్రవ్యమారక రేట్లతో ప్రజా జీవనం తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన చమురు ధరలకు నిర్ణయాత్మకమవుతోంది. రూపాయి మారకం విలువ పడిపోతోందని 2014 ఎన్నికలకు ముందు మోడీ కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శిస్తూ వచ్చారు. ఇప్పుడు మోడీ ఆయుష్మాన్ భారత్ ప్రకటించారు. అయితే రూపాయికి శస్త్రచికిత్స చేయకుండా దీనిని సాధించడం దుస్సాధ్యం. ఇది సాధిస్తే ప్రజలు ఎవరికి వారు ఆర్థికంగా ఎదగలరు. ఎవరి ఆరోగ్యం వారు చూసుకోగలరు. దివంగత ప్రధాని పివి నరసింహారావు మాత్రమే ఇలాంటి దార్శనికతను ప్రదర్శించారు. ఆయన తీసుకున్న సాహసోపేత సంస్కరణలే ఇప్పటికీ మనకు రక్షగా నిలిచాయి. ప్రధాని మోడీ ఇప్పుడు ఈ దిశగా దృష్టి సారించాలి. కఠిన పరిశ్రమ చేయాలి. పివి-మన్మోహన్ ద్వయం తెచ్చిన ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంకు ఆదేశిత ఆర్థిక విధానాలనే వాజ్‌పేయ్ ప్రభుత్వం అమలు చేసింది. అలాగే మన్మోహన్ సర్కారు బాటలోనే మోడీ ప్రభుత్వం నడుస్తోంది. కాబట్టి ఆ పార్టీలు పరస్పరం విమర్శించుకోవడం రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప నిజంగా మాత్రం కాదు. రిజర్వు బ్యాంకు రంగంలోకి దిగి రూపాయిని నిలబెట్టాల్సిఉందని చాలామంది సూచిస్తున్నారు. 80శాతం చమురు ఎలాగూ దిగుమతి చేసుకొనేదే కనుక, క్రూడాయిల్ ధర పెరిగి, దేశీయ మార్కెట్‌లో పెట్రో ఉత్పత్తుల రేట్లు మరింత హెచ్చి నిత్యావసర, వినియోగ వస్తువులు ఖరీదు కాక తప్పదు. ఉక్రెయిన్ యుద్ధంతో చమురు లభ్యత మరింత తగ్గి కొత్త కష్టాలు తెచ్చిపెట్టిందన్న ఆందోళనా ఉంది. ద్రవ్యోల్బణం

# రాజకీయాలు తప్ప అభివృద్ధి ఏదీ

### అవినీతిని ప్రశ్నిస్తే మోడీ శత్రువయ్యాడా

### మీడియా సమావేశంలో కెసిఆర్‌పై అరుణ ఫైర్

**హైదరాబాద్, అగస్టు 17 (సమ సమాజం):** ముఖ్యమంత్రి కేసీఆర్ కు రాజకీయాలు తప్ప.. అభివృద్ధిపై ధ్యాస లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... కేంద్రాన్ని విమర్శించే ముందు ఎనిదేళ్ళల్లో తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ చేసిన మోసాలకు తెలంగాణ ప్రజలు గ్గదె దించాలని చూస్తున్నారన్నారు. కుర్చీ కాపాడుకునే యావ తప్ప.. అయ్యా, కొడుకులకు వేరే ధ్యాస లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకు ముందు ప్రధాని మోదీ మిత్రుడు.. ఇప్పుడు శత్రువు ఎలా అయ్యారని నిలదీశారు. తమరు చేసే దోపిడీకి అడ్డు చెప్పకుంటే మిత్రుడు.. లేదంటే శత్రువా? అని అరుణ మండిపడ్డారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ అన్నీ తమరే పూర్తిచేశారా అని అడిగారు. కాళేశ్వరం మాదిరి.. పాలమూరు రంగారెడ్డి ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం తో కోటి ఎకరాలకు నీళ్ళు ఇచ్చావా అంటూ ప్రశ్నలు కురించారు. ప్రాజక్టుల పేరుతో లక్షల కోట్లు కమిషన్లు కేసీఆర్ దోచుకున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్ నేతల అవినీతి బాగోతం రాస్తే పెద్ద పుస్తకం అవుతుందన్నారు. పాలమూరు రంగారెడ్డి విషయంలో జగన్తో కేసీఆర్ ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ఏపీ నిర్మించిన సంగమేశ్వరకు అడ్డు చెప్పని కేంద్రం.. పాలమూరు రంగారెడ్డికే కేంద్రం అడ్డు చెప్పిందా అని అన్నారు. జగన్‌కు కేసీఆర్ అమ్ముడుపోయారని డీకే అరుణ వ్యాఖ్యలు చేశారు.

# సోనియాకు గులాంనబీ షాక్

(మొదటి పేజి తరువాయి) కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ నియమించారు. జమ్ముకశ్మీర్ పీసీసీ చీఫ్ గా వికార్ వసూల్ వనీ ని, వర్కింగ్ ప్రెసిడెంట్ గా రమణ్ భల్లాను నియమించారు. అయితే ఆజాద్ ను ప్రచార కమిటీ చీఫ్ గా నియమించగా... ఆ బాధ్యతలను తప్పుకున్నారు. గతంలో ఆజాద్ జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, కాంగ్రెస్ పార్టీలో అనేక కీలక పదవులను నిర్వర్తించారు. ఆరోగ్య కారణాల దృష్ట్యా గులాం నబీ ఆజాద్ కొత్త బాధ్యతలను స్వీకరించడానికి నిరాకరించినట్లుగా ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఓటర్ల జాబితా ఖరారు, డీలిమిటేషన్ కసరత్తు పూర్తయిన తర్వాత జమ్మ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే శీతాకాలం ముగిసేలోపు డీలిమిటేషన్, ఓటర్ల జాబితా సవరణ పూర్తి కానందున ఈ ఏడాది ఎన్నికలు నిర్వహించలేమనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ఎన్నికల సంఘం ఇటీవల ఓటర్ల జాబితా తుది ప్రచురణ తేదీని నవంబర్ 25కి సవరించింది.

# ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

### మురళీకృష్ణ




**నల్లగొండ, ఆగస్టు 17 (సమ సమాజం):** బుధవారం కొండ మల్లెపల్లి మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్స్ ను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ గారు మాట్లాడుతూ ఈ నెల 26,27,28 తేదీలలో కొత్తగూడెం పట్టణంలో ఏఐఎస్ఎఫ్ మూడవ రాష్ట్ర మహాసభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను పేదవాడికి అందని ద్రాక్ష లాగా, అంగట్లో సర్కు లాగా మారుస్తుందని విమర్శించారు, కొఠారి కమిషన్ కి భిన్నంగా జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి, విద్య కేంద్రీకరణ పేరుతో ప్రభుత్వాలు స్వయం ప్రతిపత్తిని తగ్గిస్తూ విద్యను కాషాయీకరణ వ్యాపారీకరణ చేయాలని కుట్రలు చేస్తుందని, యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యుజిసి)రద్దు చేస్తూ భారత ఉన్నత విద్యా కమిషన్(హెచ్ ఇసిఐ)తీసుకురావాలని కుటిల ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తూ విదేశీ యూనివర్సిటీలను తీసుకువస్తున్నారని దీనివలన ఉన్నత విద్య పేదవాడికి దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలను ఎత్తివేయాలని కుట్రలో భాగంగానే ప్రైవేటు యూనివర్సిటీల బిల్లును తీసుకువచ్చారని అన్నారు, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అద్దె భవనాలలో నడుస్తున్నటువంటి గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్ వెంటనే సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్ లో పది శాతం, రాష్ట్ర బడ్జెట్లో 30% నిధులు కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహాసభలలో దేశ భవిష్యత్తు కోసం విద్యార్థులను చైతన్యపరిచేందుకు విద్యారంగ సమస్యలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని కావున విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాహుల్, సంజు వంశీ, కిరణ్, శివాని, ధనలక్ష్మి, శ్రీయ, శ్రీజ, శైలజ, మాధవి, స్వాతి, శ్రీయ, మనిషా తదితరులు పాల్గొన్నారు.

# స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో రక్తదానం

### రక్తదానం చేసిన టీఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్, అగస్టు 17 (సమ సమాజం):** స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా తెలంగాణ భవన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్సీ కవితతో కలిసి ఎంపీ కే కేశవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత రక్తదానం చేశారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యల్లో పేదరికం ఒకటన్నారు. దేశం బాగుండాలంటే ప్రజలు బాగుండాలని తెలిపారు. నిరుద్యోగం, మతత్వాన్ని సమూలంగా దేశం నుంచి రూపుమాపాలని వెల్లడించారు. ప్రపంచానికి దిక్సూచిలా భారతదేశం ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, దానం నాగేందర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేషన్ చైర్మన్లు మేడే రాజీవ్ సాగర్, గజ్జెల నగేష్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, విప్లవ్ రెడ్డి తదితరుల పాల్గొన్నారు. రక్తదానం మహాదానం అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఒక వ్యక్తి పది మంది ప్రాణాలు కాపాడే అద్భుత అవకాశం రక్తదానం వల్ల లభిస్తుందని చెప్పారు. రక్తదానం వంటి బృహత్తర కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు. స్వతంత్ర వజ్రోత్సవాల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనాపూర్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్తదానం పట్ల ప్రజలకున్న అపోహలను తొలగించాలని అధికారులకు సూచించారు. ఎన్నిసార్లు రక్తదానం చేసినా ప్రాణహాని ఉండదని చెప్పారు. మనం తీసుకునే ఆహారం ద్వారా రక్తం ఉత్పత్తి అవుతుందని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చని వెల్లడించారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల ప్రాముఖ్యాన్ని దశదిశలా చాటాలని సూచించారు. నాటి ఉద్యమ స్ఫూర్తిని నేటి తరాలకు అందించాలన్నారు. వచ్చే తరాలకు శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వం విలువలు తెలియజేయాలని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరు అమృత్ మహోత్సవాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యేలు రాజయ్య, రమేశ్, ఉచిఓఅ మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్ రాజ్, జనగామ, వరంగల్ జిల్లాల జెడ్పి చైర్మన్లు, ఆయా జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల, వైద్య, వివిధ శాఖల అధికారులు, వైద్యులు, సిబ్బంది, రక్త దాతలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.




# చలన చిత్రం



## శర్వానంద్ ఒకే ఒక జీవితం లిరికల్ సాంగ్ విడుదల

యంగ్ హీరో శర్వానంద్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఒకే ఒక జీవితం' . తాజాగా ఈ సినిమా నుంచి లిరికల్ వీడియో సాంగ్ రిలీజైంది. యువ దర్శకుడు శ్రీకార్తిక్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా టైం ట్రావెల్ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతుంది. ఇటీవల రిలీజ్ అయిన ఈ మూవీ పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులందరినీ ఆకట్టుకుని మూవీపై బాగానే అంచనాలు ఏర్పరిచాయి. ఇక సెప్టెంబర్ 9న ఈ మూవీ రిలీజ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్‌ను మెల్లగా స్టార్ట్ చేశారు.దీనిలో భాగంగా 'ఒకటే కదా' అనే పల్లవితో సాగే ఫస్ట్ లిరికల్ వీడియో సాంగ్ ని విడుదల చేసింది చిత్రబృందం. జేక్స్ బిజోయ్ మ్యూజిక్ అందిస్తున్న ఈ మూవీలోని ఫస్ట్ సాంగ్ మంచి మెలోడియస్‌గా సాగుతూ ఆకట్టుకుంటుంది.



## అల్లు అర్జున్‌కు పెరుగుతున్న క్రేజ్

### ట్విట్టర్‌లో 7మిలియన్లకుచేరిన ఫాలోవర్లు

పుష్ప సినిమాతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తాజాగా ట్విట్టర్‌లో 7 మిలియన్ల ఫాలోవర్ల మార్క్‌ను అందుకున్నారు. 'పుష్ప' సినిమా తర్వాత ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ పాపులారిటీ దేశవ్యాప్తంగా అమాంతం పెరిగిపోయింది. తన నటనతో టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. తాజాగా ట్విట్టర్‌లో ఆయన 7 మిలియన్ల ఫాలోవర్ల మార్క్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులందరికీ ధన్యవాదాలు తెలుపుతూ అల్లు అర్జున్ ట్వీట్ చేశారు. మరో సోషల్ మీడియా దిగ్గజం ఇన్‌స్టాగ్రామ్‌లో బన్నీకి 18 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. పుష్ప' మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చిన బన్నీ.. దక్షిణాదితో పాటు ఉత్తరాది సినీ ప్రేమికులను విపరీతంగా ఆకట్టుకున్నారు. శేషాచలం ఎర్రచందనం నేపథ్యంగా తెరకెక్కిన ఈ సినిమాలో అల్లు అర్జున్.. తన నటనతో అదరగొట్టారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన రష్మిక కూడా తన నటనతో ఫేమస్‌అయ్యారు. 'గంగోత్రి' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన అల్లు అర్జున్.. ఆ తర్వాత 'బన్నీ', 'దేశముదురు', 'పరుగు', 'సరైనోడు', 'అల వైకుంఠపురములో' లాంటి సినిమాలతో తనదైన శైలిలో ప్రేక్షకుల్ని మెప్పించారు. ప్రస్తుతం ఆయన 'పుష్ప 2' షూటింగ్‌కు సిద్ధమవుతున్నారు.




## నలభై ఏళ్లనాటి ప్రతిబింబాలు అక్కినేని,జయసుధల చిత్రం..విడుదలకు సన్నాహాలు

కొన్ని చిత్రాలు షూటింగ్ పూర్తి చేసుకొని ఏళ్ళు గడుస్తున్నా.. ఏవో కారణాల వల్ల విడుదలకు నోచుకోవు. ఒక వేళ కాలం కలిసి వచ్చి మళ్ళీ విడుదలకు సిద్ధమైనా.. అలాంటి సినిమాలపై అంతగా అంచనాలుం డవు. అలా లేటుగా విడుదలైన చాలా చిత్రాలు నిర్మాతలకు నష్టాలే మిగిల్చాయి. కొన్ని చిత్రాలు మాత్రమే సూపర్ హిట్‌గా నిలిచాయి. ఈ నేపథ్యంలో లెజెండరీ నటులు అక్కినేని నాగేశ్వరరావు నటించిన ఓ సినిమా 40 ఏళ్ళ తర్వాత విడుదల కానుండడం విశేషమని చెప్పాలి. సినిమా పేరు 'ప్రతిబింబాలు'. అక్కినేని నాగేశ్వరరావు హీరోగానూ, జయసుధ, తులసి హీరోయిన్స్‌గానూ నటించగా.. సీనియర్ నటులు గుమ్మడి, కాంతారావు ఇతర ముఖ్యపాత్రలు పోషించారు. ఆ సినిమాను 1982లో జాగర్లమూడి రాధాకృష్ణ నిర్మించారు. ఏవో అనివార్య కారణాల వల్ల అప్పట్లో ఈ సినిమా విడుదల ముంగిటే ఆగిపోయింది. అక్కినేని జయంతి సందర్భంగా చిత్రాన్ని సెప్టెంబర్ 20న విడుదల చేయబోతున్నారు. నలభై ఏళ్ళ తర్వాత విడుదల కానున్న చిత్రం నిజానికి ఈ సినిమా దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు తండ్రి కె.యస్. ప్రకాశరావు దర్శకత్వంలో షూటింగ్ మొదలైంది. చిత్రీకరణ మధ్యలో ఉండగా ప్రకాశరావు చనిపోయారు. దాంతో సింగీతం శ్రీనివాసరావు దర్శకుడిగా రంగంలోకి దిగి మిగిలిన భాగాన్ని పూర్తి చేశారు. విష్ణుప్రియా కంబైన్స్ బ్యానర్ పై ఈ సినిమా తెరకెక్కగా చక్రవర్తి సంగీతం అందించారు. ఈ సినిమాకి సంబంధించిన వారిలో జయసుధ, తులసి, నిర్మాత రాధాకృష్ణ, మరికొందరు తప్ప మిగిలినవారెవరూ ప్రస్తుతం జీవించి లేరు. అప్పట్లో రీల్స్‌లో చిత్రీకరణ జరుపుకున్న ఈ సినిమా ప్రింట్‌ను డిజిటల్ పార్మేట్ లోకి కన్వర్ట్ చేసి ఇప్పుడు విడుదలకు సిద్ధం చేయనుండడం గమనార్హం. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకంతో మేకర్స్ ఉన్నారు. గతంలో విష్ణుప్రియ కంబైన్స్ బ్యానర్ పై 'వియ్యాలవారి కయ్యాలు, ఒక దీపం వెలిగింది, శ్రీవినాయక విజయం, కోడళ్ళొస్తున్నారు జాగ్రత్త, కోరుకొన్న మొగుడు' లాంటి విజయవంతమైన చిత్రాలు వచ్చాయి. వాటిలో కృష్ణ, శోభన్ బాబు, కృష్ణంరాజు లాంటి హీరోలు నటించారు. అయితే ఎఎన్నార్‌తో కూడా ఓ సినిమా తీయాలని భావించిన జాగర్లమూడి రాధాకృష్ణ 'ప్రతిబింబాలు' చిత్రాన్ని నిర్మించారు కానీ.. కొన్ని అనివార్య కారణాల వల్ల అప్పట్లో సినిమాను విడుదల చేయలేకపోయారు. ఎట్టేకేలకు ఇన్నాళ్ళకైనా సినిమాను విడుదల చేయనుండడం పట్ల తన సంతోషాన్ని వక్తం చేస్తున్నారు. మరి ఈ తరం ప్రేక్షకుల్ని ఎనభైలనాటి ప్రేమకథా చిత్రం ఏ స్థాయిలో మెప్పిస్తుందో చూడాలి.

## నటుడు సుహాస్‌ను ఆశీర్వించిన బ్రహ్మీ



కమెడియన్, హీరో సుహాస్‌ని హాస్యబ్రహ్మ బ్రహ్మానందం ఆశీర్వదించారు. సుహాస్ ప్రస్తుతం తెలుగు సినిమాలతో బాగా పాపులర్ అయ్యాడు. ఇటీవలే కలర్ ఫోటో సినిమాకు జాతీయఅవార్డు కూడా దక్కింది. చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టక ముందు కొన్ని లఘు చిత్రాలలో నటించి దర్శకుల దృష్టిని ఆకర్షించాడు. దాంతో 2015లో వచ్చిన దోచేయ్ సినిమాలో అవకాశం వచ్చింది. ఆ తర్వాత నటించిన పడిపడి లేచేమనసు, మజిలీ చిత్రాలు సుహాస్‌ని ప్రేక్షకులను బాగా దగ్గర చేశాయి. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, డియర్ కామ్రేడ్, ప్రతిరోజూ పండగే, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య వంటి చిత్రలు మరింత గుర్తింపును తెచ్చిపెట్టాయి.ఈ క్రమంలో సుహాస్‌కి అనుకోకుండా కలర్ ఫొటో సినిమాలో హీరో పాత్ర చేసే అవకాశం దక్కింది. చాందినీ చౌదరీ హీరోయిన్‌గా, సునీల్ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాకి సందీప్ రాజ్ దర్శకత్వం వహించాడు. సినిమా విడుదలయ్యాక అందరి నుంచి గొప్ప ప్రశంసలు దక్కాయి. ముఖ్యంగా సుహాస్‌కి ఈ సినిమా ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చి పెట్టింది. అంతేకాదు, ఈ చిత్రానికి జాతీయ అవార్డు దక్కడం గొప్ప విశేషం. అయితే, సుహాస్ ఇప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటో నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. మన టాలీవుడ్ హాస్య బ్రహ్మ అయిన బ్రహ్మానందంతో కలిసి ఉన్న పిక్‌ని సుహాస్ షేర్ చేశాడు. ఇందులో తనకి బ్రహ్మానందం ఆశీస్సులు అందించినట్టుగా ఓ కార్డు పై రాసిన పిక్ కూడా జతచేశాడు. ఈ కార్డులో బ్రహ్మానందం 'సుహాస్ కి ఉజ్వలమైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నాను.. శుభమస్తు' అని రాశారు. దీనితో ఈ పోస్ట్ ఇపుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా సుహాస్ ఆనందం వ్యక్తం చేశాడు.

## నిఖిల్‌కు ప్రభాస్ అభినందనలు బాలీవుడ్‌లోనూ షేక్ చేస్తున్న కార్తికేయ-2

యంగ్ హీరో నిఖిల్ సోషల్ మీడియా ద్వారా గ్లోబల్ స్టార్ ప్రభాస్‌కి థాంక్స్ చెప్పారు. చందు మొండేటి దర్శకత్వంలో నిఖిల్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన కార్తికేయ 2 గత వారం ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ టాక్ తెచ్చుకొని బాక్సాఫీస్ వద్ద దూసుకెళుతోంది. పాన్ ఇండియా స్థాయిలో రిలీజైన ఈ సినిమాకి సౌత్ భాషలతో పాటు నార్త్‌లోనూ మంచి ఆదరణ దక్కుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం వరుసగా సక్సెస్ మీట్స్ నిర్వహిస్తున్నారు. ఇక ఈ సినిమా సక్సెస్ పట్ల పలువురు సినీ ప్రముఖులు చిత్ర బృందాన్ని అభినందిస్తున్నారు. ఈ క్రమంలోనే గ్లోబల్ స్టార్ ప్రభాస్ కూడా తన ఇన్స్టా స్టోరీలో కార్తికేయ 2 చిత్రబృందానికి కంగ్రాట్స్ చెబుతూ టీమ్ పోస్టర్‌ను పెట్టుకున్నారు. దీనికి హీరో నిఖిల్ తన ట్విట్టర్ వేదికగా థాంక్స్ చెప్పారు. ఈ మేరకు పోస్ట్ పెట్టిన నిఖిల్ అందులో 'ప్రభాస్ భాయ్ మీ విషెస్‌కి ధన్యవాదములు. మీ మెసేజ్‌తో కార్తికేయ టీమ్ ఎంతో సంతోషపడింది'.. అని పేర్కొన్నారు. నిఖిల్ - దర్శకుడు చందు మొండేటి కాంబినేషన్‌లో వచ్చిన కార్తికేయ చిత్రానికి సీక్వెల్‌గా వచ్చింది కార్తికేయ 2. బాలీవుడ్ చిత్రాలు లాల్ సింగ్ చడ్డా, రక్షా బంధన్‌లకు కారక్తికేఉయ దెబ్బకొట్టాడు. కార్తికేయ 2 హిందీలో సత్తా చాటుతూ మంచి వసూళ్ళ రాబడుతోంది. కార్తికేయ 2 సినిమా భక్తి ఫార్మాట్ లో నార్త్ జనాలను ఎంతగానో ఏట్రాక్ట్ చేస్తోంది.కార్తికేయ 2 సినిమా రోజురోజుకు థియేటర్ల సంఖ్యను పెంచుకుంటుంది. ఇదివరకే నిర్మాత అభిషేక్ అగర్వాల్ కూడా అక్కడ ది కాశ్మీర్గ్ ÷ల్స్ తో హిందూ జనాలను గట్టిగానే ఎట్రాక్ట్ చేశారు. ఇప్పుడు శ్రీకృష్ణ పరమాత్మ బ్యాగ్రౌండ్ లో వచ్చిన సినిమా అంటూ కార్తికేయ 2 బాగా హైలైట్ చేశారు. నిఖిల్ సినిమా అక్కడ బాలీవుడ్ సినిమాలతో పోటీపడుతూ కలెక్షన్స్ అందుకోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. ఇదే తరహాలో కొనసాగితే మాత్రం తదుపరి వారం వరకు కూడా సినిమా హిందీలోనే 10 కోట్ల వరకు కలెక్షన్స్ అందుకుంటుందని టాక్.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in